# 'ఔకస్', 'క్వాడ్' సామ్రాజ్యవాదుల ప్రమాదకర మృత్యువ్యూహాలు

**అమెరికా** సామ్రాజ్యవాద అగ్రరాజ్యం అనేక ప్రపంచ దేశాల చేతుల్లో చావుదెబ్బలు తింటూనే, మరోవైపు ప్రపంచంపై తన ఆధిపత్యం చెలాయించటానికి, ప్రపంచ దేశాలలో తన మార్కెట్‌లను విస్తరించటానికి అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవలే ఆఫ్ఘనిస్తాన్‌లో 'చావు తప్పి కన్ను లొట్టబోయి' పలాయనం చిత్తగించిన నేపథ్యంలోనూ అమెరికా కొత్త ఎత్తుగడలతో ముందుకు వస్తోంది.

తాజాగా, అమెరికా – ఆస్ట్రేలియా, బ్రిటన్‌లతో కలిసి 'ఔకస్' (AUKUS) అనే ఓ కూటమిని రంగం మీదకు తెచ్చింది. అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం అందించుకునే లక్ష్యాన్ని ఈ కూటమి పైకి ప్రకటిస్తున్నప్పటికీ, ఇది ఒక సైనిక కూటమి మినహా వేరు కాదు. అణువిద్యుత్‌తో నడిచే జలాంతర్గాములను అమెరికా సాయంతో బ్రిటన్ నిర్మించి ఆస్ట్రేలియాకు అందించే విధంగా ఈ కూటమి తొలి ఒప్పందం చేసుకుంది. చైనాకు పోటీగా హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్రాల తీరప్రాంత దేశాలను అణుశక్తితో నడిచే జలాంతర్గాములతో అమెరికా అదుపు చేయబూనుకుంటున్నది.

## సామ్రాజ్యవాదుల నడుమ పదునెక్కుతున్న వైరుధ్యాలు

అణు జలాంతర్గాముల ఒప్పందానికి రాకమునుపే, డీజిల్‌తో నడిచే జలాంతర్గాములు నిర్మించి ఇచ్చే విధంగా ఆస్ట్రేలియా, ఫ్రాన్స్‌తో 9000 కోట్ల డాలర్ల భారీ ఒప్పందం చేసుకుంది. ఈ ప్రాజెక్టుపై 1800 కోట్ల డాలర్లు వెచ్చించిన తర్వాత ఈ ఒప్పందం నుండి ఆస్ట్రేలియా ఏకపక్షంగా వైదొలగింది. ఫ్రెంచ్ విదేశాంగ శాఖామంత్రి ఈ చర్యను వెన్నుపోటుగా పేర్కొన్నాడు.

'నాటో' కూటమిలో అమెరికా, బ్రిటన్‌లతో పాటు ఫ్రాన్స్ కూడా భాగస్వామి. అయినా, తనను సంప్రదించకుండా, తనను మినహాయించి 'ఔకస్' ఏర్పాటు చేయటం పట్ల ఫ్రాన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జలాంతర్గాముల భారీ నిర్మాణ ఒప్పందం నుండి ఆస్ట్రేలియా తప్పుకోవటం ఫ్రాన్స్‌కు మింగుడు పడలేదు. దీనితో తక్షణం ఆస్ట్రేలియా, అమెరికాల నుండి తన దేశ రాయబారులను వెనుకకు రప్పించింది. బ్రిటన్ – ఫ్రాన్స్ దేశాల నడుమ జరగాల్సిన రక్షణ మంత్రిత్వశాఖల సంయుక్త సమావేశాలను రద్దు చేసింది.

ఇప్పటికే పసిఫిక్ సముద్ర జలాలలో ఏడు ఫ్రెంచ్ నావికాదళ నౌకలు, నలభైదాకా యుద్ధ విమానాలు, 5–6 వేలమంది ఫ్రెంచ్ సైనికులు గస్తీ కాస్తున్నారు. హిందూ – పసిఫిక్ తీరప్రాంత దేశాలపై, సముద్ర మార్గాలపై, ఆయాదేశాల మార్కెట్లపై అదుపు కోసమే 'ఔకస్' కూటమి ఏర్పడిందని ఫ్రాన్స్‌కు తెలుసు. ఈ కూటమిలో తనను ప్రక్కన పెట్టటం పట్ల ఫ్రాన్స్ బాహాటంగానే తన అసంతృప్తిని వ్యక్తం చేసింది. సామ్రాజ్యవాద దేశాల మధ్య ఇప్పటికే కొనసాగుతున్న వైరుధ్యాలను 'ఔకస్' కూటమి ఏర్పాటు మరింత పదునెక్కించింది.

యూరోపియన్ యూనియన్ నుండి బయటకొచ్చాక – బ్రెగ్జిట్ తర్వాత – బ్రిటన్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం – 'ఔకస్' కూటమిలో భాగస్వామి గావటం. బ్రెగ్జిట్ తర్వాత యూరప్ మార్కెట్‌ను ఎక్కువగా కోల్పోయిన బ్రిటన్, ఇపుడు ఈ యుద్ధ కూటమి ద్వారా తన మార్కెట్‌ను విస్తరించదలచుకుంటున్నది.

అమెరికా నాయకత్వంలో 'నాటో' కాకుండా, 'యూరప్ ఆర్మీ' కావాలని జర్మనీ, ఫ్రాన్స్‌లు ఎప్పటి నుండో చేస్తున్న ప్రతిపాదన ఇప్పుడు రూపందుకుంది. అలాగే, యూరోపియన్ యూనియన్ దేశాలు అమెరికాను కాదని ఇరాన్ నుండి చమురు దిగుమతికి, రష్యాతో గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంటున్నాయి.

"అమెరికా సామ్రాజ్యవాదులకు, ఇతర సామ్రాజ్యవాద దేశాలకు మధ్య వైరుధ్యాలు తీవ్రమౌతున్నాయి. ప్రపంచ దోపిడీ పెత్తనాలలో 'సముచితమైన' వాటాకోసం అమెరికాతో పోటీ పడటానికి ఇతర సామ్రాజ్యవాద దేశాలు సిద్ధపడుతున్నాయ"ని 2018 ఫిబ్రవరినాటి సిపిఐ(ఎం–ఎల్) కేంద్రకమిటి రాజకీయ తీర్మానంలో పేర్కొన్నవిధంగా పరిణామాలు సాగుతున్నాయి.

## 'క్వాడ్' కొనసాగింపే 'ఔకస్'

ఆసియా – పసిఫిక్ ప్రాంతంపైన, ఆ ప్రాంత సముద్ర మార్గాలపైన తన ఆధిపత్యాన్ని చెలాయించేందుకు అమెరికా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. 2007లోనే ఆస్ట్రేలియా, జపాన్, ఇండియా, అమెరికా దేశాల ఉన్నత స్థాయి సమావేశంలో 'క్వాడ్' కూటమి ప్రకటన చేశారు. ఆపై అమెరికా మన దేశాన్ని తన పెద్ద రక్షణ భాగస్వామిగా ప్రకటించింది. భారత–అమెరికా సైనిక బలగాల మధ్య అనుసంధానం బలపడే ఒప్పందాలు; అమెరికా యుద్ధ విమానాలు భారత్‌లో దిగేందుకు, వాటికి అవసరమైతే మరమ్మత్తులు మనదేశంలోనే చేసేందుకు, ఇంధనం నింపుకునేందుకు పలు సైనిక, రక్షణ ద్వైపాక్షిక ఒప్పందాలు 2015–20ల మధ్య కాలంలో జరిగాయి. ఆ తర్వాత 2020 సం॥లో 'క్వాడ్'ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించారు.

ఆసియా – పసిఫిక్ ప్రాంతంలో నౌకాయాన స్వాతంత్ర్యం, వివాదాల పరిష్కారం, విధి విధానాలతో కూడిన దీని నిర్వహణ తన లక్ష్యమని 'క్వాడ్' ప్రకటించుకుంది. కాగా, చైనాకు వ్యతిరేకంగా ఉద్దేశించిన ఆసియాకు చెందిన 'నాటో'గా 'క్వాడ్'ను అమెరికా పరిగణిస్తోంది. ఇటీవల బిజెపి జాతీయ కార్యదర్శి వై. సత్యకుమార్ కూడా ఆసియా – పసిఫిక్ ప్రాంతంలో మరో 'నాటో'గా క్వాడ్ కూటమి అవతరిస్తుందని చాలా గొప్ప విషయంలాగా పేర్కొంటున్నాడు. అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ రథచక్రాలకు మనదేశాన్ని కట్టివేస్తున్నారనే అంశాన్ని వారు దాచిపెడ్తున్నారు.

## అమెరికాకు కొరకరాని కొయ్యగా చైనా

సోవియట్ యూనియన్ పతనానంతరం అగ్రరాజ్యంగా ప్రపంచాధిపత్యం చెలాయించగలనన్న అమెరికా కలలకు చైనా కళ్ళెం వేసింది. అనతి కాలంలోనే ప్రపంచ మార్కెట్లలో అమెరికాకు అతిపెద్ద పోటీదారుగా చైనా ముందుకొచ్చింది. చైనా శక్తివంతమైన ఆర్థిక, రాజకీయ, సైనిక శక్తిగా ఆవిర్భవించటం; ప్రపంచ మార్కెట్లలోకి చైనా తన భారీ పెట్టుబడులు, సరుకులు, సాంకేతిక నైపుణ్యాలతో విస్తృతంగా ప్రవేశించటం – అమెరికాకు, ఇతర సామ్రాజ్యవాద దేశాలకు కంటగింపుగా వుంది. అంతేగాక, ఇప్పటిదాకా వారి అధీనంలో వుండి, వారు దోపిడీ చేసుకునే మార్కెట్లను కూడా చైనా దూకుడుగా ఆక్రమించుకుంటూ వుండటం – సామ్రాజ్యవాదులకు ప్రత్యేకించి అమెరికాకు అస్సలు మింగుడు పడటంలేదు. తూర్పు ఆసియా నుండి ప్రారంభించి చైనా నిర్మిస్తున్న బృహత్తర 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్' (బిఆర్ఐ) అమెరికాను కలవర పరుస్తోంది. అందుకే చైనాను అష్టదిగ్బంధం చేయటానికి అమెరికా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. 'క్వాడ్', 'ఔకస్' కూటముల ఏర్పాటు; అలాగే దక్షిణ కొరియా, వియత్నాం, న్యూజిలాండ్‌లను కలుపుకొని 'క్వాడ్‌ప్లస్'; భారత పాలకులచే ఇజ్రాయిల్, యుఏఇ, సౌదీ అరేబియాలతో మరో 'క్వాడ్' కూటమి ఏర్పాటుకు ప్రతిపాదనలన్నీ ఈ ప్రయత్నాలలో భాగమే.

చైనా చాలా కాలంగా పెట్టుబడిదారీ పంథాలోనే సాగుతోంది. ప్రపంచ మార్కెట్లను ఆక్రమించటానికి, ప్రపంచ మార్కెట్లను తనకనుకూలంగా ప్రభావితం చేసుకోవటానికి చైనా ప్రయత్నాలు చేస్తోంది. ఆధిపత్యవాదానికి తాను వ్యతిరేకమని, ఆధిపత్య విస్తరణవాద కాంక్షలను తాను అనుసరించబోనని చైనా పదేపదే ప్రకటిస్తోంది. అయినప్పటికీ ఆసియా – పసిఫిక్ దేశాలపై, ప్రజలపై అమెరికా ఆధిపత్య విధానాలను వ్యతిరేకించటానికి చైనా చేపట్టిన పద్ధతులు సందేహాస్పదంగా, ప్రశ్నలు రేకెత్తించేవిగా వున్నాయి. ఆసియా – పసిఫిక్ దేశాలకు, ప్రజలకు విశ్వసనీయ మిత్రునిగా భరోసా కల్పించేవిధంగా చైనా వ్యవహరించటం లేదనేది వాస్తవం.

## చైనాపై గురి – భారత్ భుజాలపై తుపాకి

భారతదేశాన్ని తమకు శక్తివంతమైన చైనా వ్యతిరేక స్థావరంగా కూడా మార్చేందుకు, ఆసియా – పసిఫిక్ ప్రాంతంలో తమ ఆధిపత్య కార్యక్రమాలను ముందుకు నెట్టేందుకు – అమెరికా సామ్రాజ్యవాదులు ఆతృతతో వున్నారు. చైనాతో సరిహద్దు సమస్యపై మన దేశ సంబంధాలు ఒక కొలిక్కి రాకూడదని వారు కోరుకుంటున్నారు. మనదేశంలో చైనా వ్యతిరేకతను ప్రసార మాధ్యమాల ద్వారా పెద్ద ఎత్తున పెంచుతున్నారు. చైనాను పూర్తిగా ధ్వంసం చేస్తేనే నిజమైన, శాశ్వతమైన పరిష్కారం లభిస్తుందనే ఉన్మాదాన్ని దేశ పాలకులతో కలసి ప్రజల మెదళ్ళలో దట్టించే ప్రయత్నం చేస్తున్నారు. చైనాతో ఎదురౌతున్న వివాదాలను సమానత్వం, న్యాయం ప్రాతిపదికన చర్చల ద్వారా పరిష్కరించుకోవటానికి బదులుగా భారత్‌ను 'క్వాడ్' కూటమిలో భాగం చేయటాన్ని ప్రతిష్ఠాత్మకమైనదని ప్రబోధిస్తున్నారు. చైనాపై ఎక్కుపెట్టిన 'క్వాడ్' లేదా 'ఔకస్' కూటములు ఆసియా ఖండంలో సరికొత్త ప్రచ్ఛన్న యుద్ధానికి రంగం సిద్ధం చేస్తున్నాయి. చైనాపై కాల్పులు జరపటానికి మన భుజాలపై తుపాకులు మోపుజేయటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరాదు. ఇప్పటికే మన తీరప్రాంతాలు, మహాసముద్రాలు నిరంతర యుద్ధనౌకల, అణుజలాంతర్గాముల సంచార కేంద్రాలుగా, ఉద్రిక్త ప్రాంతాలుగా మారిపోయాయి. గత రెండు సం॥లుగా 'క్వాడ్' కూటమి దేశాల ఆధ్వర్యంలో తూర్పు తీరంలోని బంగాళాఖాతంలో మలబార్ విన్యాసాల పేరిట యుద్ధనౌకలు, హెలీకాప్టర్లు, జలాంతర్గాములతో సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నారు.

ఈ సంవత్సరం అక్టోబర్ 3వ వారంలో విశాఖ తీరంలో బంగాళాఖాత సముద్ర జలాల్లో మలబార్–2 యుద్ధనౌకా విన్యాసాలు జరిగాయి. అమెరికా నావికాదళాల సేనాని మైఖేల్, విశాఖ వచ్చి ఈ విన్యాసాలను పర్యవేక్షించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలబార్ సైనిక విన్యాసాలను ఇంకా విస్తరిస్తామని, అందుకు మరికొన్ని దేశాలను కలుపుకుంటామని, అలాగే గగనంలో వాయుసేన, సముద్రంపై యుద్ధనౌకలు, సముద్ర గర్భంలో జలాంతర్గాములతో వివిధ రూపాల్లో ఈ విన్యాసాలు నిర్వహిస్తామని పేర్కొన్నాడు. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రమైన విశాఖపట్టణం, 970 కిలోమీటర్లు విస్తరించి వున్న ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం భారత, అమెరికా రక్షణ మంత్రిత్వ శాఖలకు కీలకమైనవిగా మారాయి. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన బిల్లు – 2014' ఆమోదం పొందటానికి 5 సం॥ క్రితం నుండే ఈ తీరప్రాంత వ్యూహాత్మక ప్రాధాన్యతపై

ప్రత్యేకించి లోతైన అధ్యయనం జరిగింది. రాష్ట్ర విభజన జరిగింది. అయితే దీని వెనుక సామ్రాజ్యవాదుల వ్యూహాత్మక అంచనాలు నిర్ణయాత్మకమైనవిగా వుండవచ్చనే వాదన కొట్టివేయాల్సింది కాదు.

ఇప్పటికే ఒంగోలు – నెల్లూరు, ఒంగోలు – చిలకలూరిపేట జాతీయ రహదార్ల మీద వాయుసేనకు చెందిన యుద్ధ విమానాలు అత్యవసరంగా దిగటం కోసం నేషనల్ హైవే అథారిటీ 'ఎయిర్ స్ట్రిప్స్' నిర్మిస్తోంది. ప్రకాశం జిల్లా కొరిశపాడు-రేణింగవరం మధ్య ఒకేసారి నాలుగు యుద్ధ విమానాలు దిగటానికి వీలుగా కోట్లాది రూ॥ల వ్యయంతో 5 కి॥మీ మేర ఒకటి; కలికివాయి-సింగరాయకొండ మధ్య 3.60 కి॥మీ మేర మరొకటి నిర్మిస్తున్నారు.

మారిషస్‌కు చెందిన ఉత్తర అగలేగా దీవిలో భారత నావికాదళం గోప్యంగా ఇటీవల ఒక సైనిక స్థావరం నిర్మిస్తోంది. కీలకమైన మొజాంబిక్ ఛానెల్‌లో నౌకల కదలికలను ఎప్పటికప్పుడు గమనించటానికి, నిఘా కార్యకలాపాల కోసం ఈ నిర్మాణాలు సాగుతున్నాయి. మారిషస్‌లో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామనే పేరిట మారుమూల దీవిలో కోట్లాది రూ॥ వెచ్చించి మూడువేల మీటర్ల రన్‌వేతో కూడిన వైమానిక స్థావరం, నౌకా కేంద్రం, కమ్యూనికేషన్ హబ్‌ను మన దేశ పాలకులు ఏర్పాటు చేస్తున్నారు. అమెరికా సామ్రాజ్యవాదుల యుద్ధ ప్రయోజనాలలో భాగంగా హిందూ మహాసముద్రంలో చైనా ప్రాబల్యానికి చెక్ పెట్టేందుకే ఈ నిర్మాణాలు చేపట్టారన్నది స్పష్టమౌతోంది.

ఇవి కొద్ది ఉదాహరణలు మాత్రమే. అమెరికా ఇప్పటికే మనదేశంతో భారీస్థాయి ఆయుధాల వ్యాపారం సాగిస్తోంది. మన దేశాన్ని తమకు లోబడిన బానిస దేశంగా కట్టిపడేసింది. చైనాతో మనదేశానికున్న విబేధాల పరిధిని ఆసియా – పసిఫిక్ ప్రాంతానికి విస్తరించారు. 'క్వాడ్'లో భాగస్వాములను చేశారు. 'ఔకస్' కూటమి నేర్పరిచారు. ఈ వాతావరణం – యుద్ధం, ఆయుధాల వ్యాపారంపై ఆధారపడిన అమెరికా ఆర్థికవ్యవస్థకు మంచి మార్కెట్‌ను సృష్టిస్తుంది. చైనా బూచిని చూపి ఈ ప్రాంత దేశాలలో అమెరికా ఆయుధాల అమ్మకంతో సూపర్ లాభాలార్జిస్తుంది.

## 'క్వాడ్' 'ఔకస్'ల రద్దుకై ఉద్యమించాలి

'క్వాడ్'లో చేరటం ద్వారా మనదేశం ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోని దేశాలకు, ప్రజలకు నమ్మకమైన మిత్రునిగా వుండే హక్కును, అవకాశాన్ని కోల్పోయింది. అంతేగాక వారందరితో శత్రుత్వాన్ని కొని తెచ్చుకుంటున్నది. ఆసియా– పసిఫిక్ ప్రాంత ప్రజానీకం – అగ్రరాజ్యాల ఆధిపత్య పోటీలకు, యుద్ధ క్రీడలకు వ్యతిరేకంగా సాగించే ఉమ్మడి పోరాటంలో మనదేశం భాగం పంచుకునే అవకాశాన్ని కోల్పోతుంది.

ఆసియా – పసిఫిక్ ప్రాంతంలో యుద్ధ ఉద్రిక్తతలను పెంచే, మన దేశాన్ని అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ రథచక్రాలకు బంధించే దుర్మార్గమైన 'క్వాడ్' 'ఔకస్' కూటములను ఈ ప్రాంత దేశాల ప్రజానీకమంతా వ్యతిరేకించాలి. ఆసియా – పసిఫిక్ ప్రాంత దేశాల ప్రజానీకంలో భాగంగా మన దేశంలోని కార్మికులు, రైతాంగంతో సహా పీడిత ప్రజానీకం, శాంతికాముకులందరూ ఈ యుద్ధ కూటములను రద్దుచేయాలని, సామ్రాజ్యవాదులు – ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు మన దేశంతో చేసుకున్న అన్ని సైనిక ఒప్పందాలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించాలి.

★★★★★